# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

సెప్టెంబర్ 26, 2017

**బర్మాలో భాగమైన రోహింగ్యా ముస్లింల పై సైనిక దాడులను తక్షణం నిలిపివేసి**

**వారిని సురక్షితంగా వారి నివాసాలకు తరలించాలి !**

గత నెల రోజులకు పైగా ప్రపంచమంతా రోహింగ్యా ముస్లిం ప్రజల పై జరుగుతున్న బర్మా సైనిక దాడులను ఖండిస్తూ వారికి అండగా నిల్చిన వారితో మన పార్టీ భుజం భుజం కలిపి నిలుస్తుందని వారి హక్కుల కోసం పోరాడుతుందని ప్రకటిస్తోంది.

రోహింగ్యా ముస్లిం ప్రజలారా, మీరు ఒంటరిగా లేరు. ప్రపంచవ్యాప్తంగా విముక్తిని కోరుతున్న జాతులలో మీరు భాగమని మా పార్టీ భావిస్తోంది. బర్మా సైన్యంతో కుమ్మక్కైన కరుడుగట్టిన బౌద్ధ గురువుల జాతి అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రోహింగ్యా ముస్లిం ప్రజల న్యాయమైన పోరాటానికి అండగా నినదించాల్సిన తరుణమిదని మా పార్టీ భావిస్తూ, దేశ ప్రజలకు ముఖ్యంగా జాతుల సమస్య పై పోరాడుతున్న ఉద్యమకారులకు, మేధావులకు, లౌకికవాదులకు, మత మైనార్టీలకు, విద్యార్థి-ఉద్యోగులకు అందుకు నడుం బిగించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది.

1948లో బ్రిటిష్ వలసవాదుల నుండి అధికార మార్పిడి జరిగిన బర్మాలో అరకాన్ భాగమైంది. దానిని సరిహద్దులలో గల తూర్పు పాకిస్తాన్‌లో కలుపాలన్న చర్చలు అంతటితో ఆగిపోయాయి. 1947లో హత్యకు గురైన ఆంగ్‌సాన్ బ్రిటిష్ వారి హయాంలో ఏర్పర్చిన దేశ పాలనా వ్యవస్థలో (కార్యనిర్వాహక కమిటీ) బర్మాలోని మైనార్టీ ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించిన సంప్రదాయం ఆయన మరణంతో రద్దయ్యింది. ఫలితంగా బర్మా దేశంలో పశ్చిమ ప్రాంతంలో ఉన్న అరకాన్ రాష్ట్రంలో నివసిస్తున్న దాదాపు 20 లక్షల రోహింగ్యా ముస్లిం ప్రజలు ఆ తదనంతరం ఆ దేశంలో కనీసం పౌరసత్వానికైనా నోచుకోకుండా దుర్భరంగా జీవించాల్సి వస్తోంది. 1962లో జనరల్ నే విన్ సైనిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బౌద్ధమత ప్రాబల్యంతో సైన్యం ముస్లిం మైనార్టీ ప్రజలను దారుణంగా హింసించసాగింది. రోహింగ్యా ముస్లింలను బర్మేతరులు, బౌద్ధులు కారంటూ, నల్లతోలు బంగ్లాదేశీయులంటూ విదేశీయులు, అలాగే బౌద్ధం పవిత్రతకు ప్రమాదకరం అంటూ జాతి వివక్ష రూపంలో అవమానించడం, వేధించడం, హింసించడం తీవ్రమయ్యాయి. 1970 నుండి వారి పై దాడులు మొదలయ్యాయి.

1982లో బర్మాలో నూతన పౌరసత్వ చట్టాన్ని రూపొందించారు. దానితో ఆ దేశంలోనే నివసిస్తున్న తరతరాల రోహింగ్యా ముస్లింలతో పాటు 135 ఎత్నిక్ గ్రూపుల గుర్తింపు రద్దయిపోయి వారి జీవితాలకు ఆ దేశంలో ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు, హామీ, భద్రతా లేకుండా పోయాయి. నూతన చట్టంతో ఎత్నిక్ గ్రూపుల పై అనేక నిషేధాలు అమలులోకి వచ్చాయి. వారు తమ గ్రామం విడిచి వెళ్లాలన్నా, తమ మసీదులు మరమ్మతు చేసుకోవాలన్నా, పెళ్లి చేసుకోవాలన్నా చివరకు పిల్లలు కనాలన్నా వారికి ప్రభుత్వ అనుమతి అవసరమైంది. పెళ్లి కాని కన్యలు గర్భం దాలిస్తే దేశం వదిలి వెళ్లాలి లేదా ప్రాణాపాయానికి సిద్ధపడి నాటు పద్ధతులలో గర్భస్రావం చేసుకోవాలి. పేదరికం, అపరిశుభ్రమైన వాతావరణంలో సరైన వైద్య సహాయం కరువై గర్భస్రావంతో మరణించిన మహిళలు అనేక మంది ఉన్నారు. 1989లో అరకాన్ ప్రాంతం రఖైన్‌గా, బర్మా పేరు మయన్మార్‌గా మారింది. రఖైన్‌లో నికృష్ట పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్న రోహింగ్యా ముస్లింల పై 1991లో రెండవ సైనిక దాడి ఆపరేషన్ పై థయ-ఆపరేషన్ క్లీన్ ఎండ్ బ్యూటిఫుల్ నేషన్ (పరిశుభ్రమైన అందమైన జాతి) పేరుతో జరిగింది. ప్రతి సైనిక దాడిలో రోహింగ్యా ముస్లిం ప్రజలు అనుభవించిన బాధలు చెప్పనలవి గానివి. వారి ఇండ్లు ధ్వంసమయ్యేవి, వారి భూములు లాక్కునేవారు, వారు ఆస్తులు స్వాధీనం చేసుకునేవారు. మహిళలపై, యువతుల పై బర్మా సైనికులు సామూహిక అత్యాచారాలకు పాల్పడేవారు. పురుషుల నాలుకలు తెగకోసేవారు. సజీవ దహనాలకు పాల్పడేవారు. ప్రజలలో భయ భీభత్స వాతావారణాన్ని తథాగతుడి (బుద్ధుడు) మతం ప్రాబల్యంలో ఉన్న ఆ దేశంలో ఫాసిస్టులు సృష్టించేవారు. సైనికులతో ఈ అన్ని చర్యలలో ఆ ప్రాంతంలోని దుండగుల విజిలెంట్ గ్యాంగులు పాల్గొని బుద్ధుడి శాంతి, అహింసల పరమార్థాన్ని ఈ రకంగా చాటేవారు.

1994లో రఖైన్ ప్రాంతంలో అమలులోకి వచ్చిన స్థానిక చట్టం ద్వారా ఇద్దరు పిల్లలనే కనడానికి సిద్ధపడిన జంటలకు పెళ్లి అనుమతి దొరికేది. ఇలాంటి చట్టాలు, అనేక నిషేధాలతో రోహింగ్యా ముస్లిం ప్రజల జనాభాను నియంత్రించడానికి స్లో పాయిజన్‌లా పాలకులు చేసిన కుట్రలకు-కుతంత్రాలకు తోడు సైనిక దాడులు జరిపే నరసంహారాలు వారి జీవితాలను దారుణంగా చేసేవి. వేల సంఖ్యలో ప్రజలు పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు శరణార్థులుగా తల దాచుకోవడానికి వెళ్లక తప్పేది గాదు. తమ జాతి మనుగడ కోసం, ఆత్మగౌరవం కోసం, జీవించే హక్కు కోసం రోహింగ్యా ముస్లిం ప్రజల పోరాట సంస్థలు అరకాన్ రోహింగ్యా విముక్తి సేన (అరాకన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ-ఎఆర్ఎస్ఎ) ఉనికిలోకి వచ్చి బర్మా ఫాసిస్టు సైన్యాలను సాయుధంగా ప్రతిఘటిస్తున్నాయి.

2016 ఏప్రిల్‌లో ఎన్ఎల్‌డీ (నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ) పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యం, మానవహక్కులకు ప్రతీకగా ప్రపంచానికి

పరిచయమైన ఆంగ్‌సాన్ సూకీ ఆ దేశ అధ్యక్షురాలైంది. ఆమెకు నోబుల్ శాంతి పురస్కారం కూడా లభించింది. అయినప్పటికీ ఆమె అధికారంలోకి వచ్చాక రోహింగ్యా ముస్లిం ప్రజలపై దాడులు తీవ్రమయ్యాయి. 2016 ఆగస్టు 25 నాడు బార్డర్ గార్డు పోస్టు పై ఏఆర్ఎస్ఏ వారు దాడి చేసి తొమ్మిది మంది సైనికులను మట్టుబెట్టడాన్ని సాకుగా తీసుకుని బర్మా సైనిక దాడులు మరోమారు తీవ్రమయ్యాయి. సైన్యంతో పాటు యధావిధిగా విజిలెంట్ గ్యాంగ్‌లు దాడులకు దిగాయి. వందలాది ముస్లిం ప్రజల ఇళ్లు బూడిదయ్యాయి. వందల సంఖ్యలో ప్రజలు సైన్యం ఊచకోతలో ప్రాణాలు కోల్పోయారు. మహిళలు, యువతుల పై సామూహిక అత్యాచారాలు పెచ్చరిల్లాయి. ముక్కుపచ్చలారని పిల్లలను సైతం సైనికుల తుపాకి గుండ్లు బలి తీసుకున్నాయి. వేల సంఖ్యలో ప్రజలు బంగ్లాదేశ్‌కు శరణార్థులుగా వెళ్లాల్సి వచ్చింది. ఇంత జరుగుతున్నా శాంతి, ప్రజాస్వామ్యాల నాయిక సూకీ మౌనం దాల్చి నరసంహారాన్ని ప్రోత్సహించింది. నోబుల్ బహుమతుల వెనుక దాగిన అసలు ముఖాన్ని చాటుకుంది.

బంగ్లాదేశ్‌లో శరణార్థుల అవస్థలు వర్ణణాతీతం. అక్కడికి వివిధ విడుతలలో దాదాపు 5 లక్షల రోహింగ్యా ముస్లిం ప్రజలు శరణార్థులుగా చేరుకున్నారు. తూర్పు బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌లోని లాడీ క్యాంపలో తల దాచుకుంటున్న ప్రజల జీవితాలు చూస్తే దోపిడీ వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలు బట్టబయలు అవుతాయి. రఖైన్ ప్రాంతం నుండి నాఫ్స్ నది గుండా ప్రయాణం చేసి కొండల దారులలో సరిహద్దు ప్రాంతం కాక్స్ బజార్ చేరే సరికే ఆ ప్రజలు అనేక అవస్థలు పడాల్సి ఉంటుంది. వారు ఆకలికి అలమటిస్తూ, రోగాల పాలైతే వైద్యం కరువై, నిండు చూలాలైతే ప్రసవ వేదనలతోనే పయనించి బంగ్లాదేశ్ చేరితే అక్కడి ప్రభుత్వం వారి పట్ల అనుసరిస్తున్న వైఖరి అమానవీయమైనది. యూఎన్‌హెచ్‌సీఆర్ (యూనైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్) ప్రకారం బంగ్లాదేశ్‌లో కేవలం 28 వేల మందే శరణార్థులుగా నమోదయ్యారంటే మిగిలిన లక్షలాది ప్రజల జీవితాలు అక్కడ ఎంత నికృష్టంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. 1948లో ఐక్య రాజ్య సమితి నరసంహారక నేరాన్ని నిరోధించి శిక్షించే విషయంలో చేసిన చట్టాలను సైతం అన్ని ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయి. బర్మాలోనైతే అక్కడి ప్రభుత్వం రోహింగ్యా ముస్లిం శరణార్థులకు వరద ముంపుకు పేరు పోయిన థెంగర్‌చార్ లాంటి ప్రాంతాలలో బస కల్పిస్తూ వారిని ఆధునిక బానిసల్లా పరిగణిస్తూ అనేక ఆధునిక నిర్మాణ పనులలో వారి శ్రమను కొల్లగొట్టడమే కాకుండా సైన్యం ఆ మహిళలను బలవంతంగా వేశ్యరికంలోకి నెడుతున్నది. ఇలాంటి అమానవీయ చర్యలను ముక్త కంఠంతో ఖండించాలి.

మయన్మార్‌లో రోహింగ్యా ముస్లిం ప్రజలకు ఎలాంటి సహాయమైనా అందిస్తున్న సంస్థలను అక్కడి ప్రభుత్వం, సైన్యం అడ్డుకుంటున్నాయి. అక్కడి ప్రజలను ఆకలి మంటలలో మాడుస్తున్నాయి. ఐక్య రాజ్య సమితి నుంచి కూడా సహాయం అందనివ్వడం లేదు. ఇంతే కాదు, అక్కడి ప్రజల పై ఏళ్ల తరబడిగా అమలవుతున్న ఫాసిస్టు చర్యలను పరిశీలించడానికి నిజనిర్ధారణ సంస్థలను, పాత్రికేయులను ప్రవేశించనీయడం లేదు. 2017 జనవరిలో ఐక్య రాజ్య సమితి చే పంపబడిన మహిళను తమ దేశంలో ఓ వేశ్య పర్యటిస్తున్నదంటూ విశ్వ కుఖ్యాత ఉగ్రవాదుల జాబితాలో చేరవలసిన బౌద్ధ గురువు అశిన్ విరాతు విషం కక్కాడు. ఐక్య రాజ్య సమితి మాజీ జెనరల్ సెక్రటరీ కోఫీ అన్నన్ గత సంవత్సరం పర్యటించి అక్కడి ప్రజల పట్ల ఎంతో సానుభూతిని వ్యక్తం చేస్తూ ప్రభుత్వ, సైనిక చర్యలను తీవ్రంగా ఖండించాడు.

రోహింగ్యా ముస్లిం ప్రజల పట్ల భారత పాలకులు అనుసరిస్తున్న దుష్ట వైఖరిని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు గత ప్రభుత్వాలు అక్కడి సైనిక శాసనం పట్ల వ్యతిరేకించిన వైఖరికీ, విధానాలకూ భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రోహింగ్యా ప్రజలు ముస్లింలు కావడంతో వారంతా ఇస్తాం ఉగ్రవాదుల పోషకులంటూ, వారికి ఆశ్రయం ఇవ్వ నిరాకరించడం వారి కాషాయ ఉగ్రవాదాన్ని చాటుతుంది. దేశంలో నామమాత్రంగా ఉన్న నాలుగు వేల రోహింగ్యా ముస్లిం ప్రజల పట్ల కూడా వివక్ష ప్రదర్శిస్తూ ప్రపంచ దేశాల ముందు తన ఇస్లాం ఫోబియాను ప్రదర్శించుకుంది. 'మేక్ ఇన్ ఇండియా' ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంను తలకెత్తుకున్న సామ్రాజ్యవాదుల ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదుల నమ్మినబంటు మోదీ అండ్ కంపెనీకి మయన్మార్‌లో ఇంధనం మరియు సహజ వాయువుల నిల్వలపై దేగ కన్ను ఉండడంతో పాటు ఆ దేశానికి సైనిక సరంజామాను అమ్ముకోవడమే పరమావధిగా ఉంది. మోదీకి ఎటు చూసినా ప్రతికక్షిగా హిందూ మహాసాగరాన్ని సైనికీకరిస్తున్న చైనానే అగుపడుతుండడంతో తన వసుధైక కుటుంబం అంతా ఉత్తదేనని, ప్రజలను మోసం చేసే దగారుకు ప్రేలాపనేనని స్పష్టమవుతుంది. ఆగ్నేయాసియా దేశాల పాలకవర్గాలు రోహింగ్యా ముస్లింల సమస్య ఆ దేశ అంతర్గత సమస్య అని చేతులు దులుపుకోవడం నిందనీయం.

ప్రజలారా, ప్రజాస్వామికవాదులారా!

దిల్లీలో రోహింగ్యా ముస్లిం ప్రజలకు సంఘీభావం ప్రకటిస్తూ అనేకమంది ముందుకు రావడం అభినందనీయం. అంతిటితో ఆగకుండా ఆ ప్రజల కడగండ్లను కడతేర్చే ప్రతి చర్యను సమర్థిస్తూ, వారికి అన్ని విధాల సహాయాన్ని అందించడానికి దేశ వ్యాప్తంగా క్యాంపెయిన్ చేపట్టాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తుంది. ఆ బాధిత ప్రజలను ఆర్థికంగా, హార్థికంగా, ఆదుకోవడానికి నడుం బిగించండి. ఆ జాతి ప్రజలు జీవించే హక్కుతో సహా సమస్త పౌర, ప్రజాస్వామ్య హక్కులను ఎత్తిపట్టండి. రోహింగ్యా ముస్లింలు విదేశీయులు కారు, బర్మావాసులేనని ఎలుగెత్తి చాటండి.

Abhay

అభయ్
అధికార ప్రతినిధి
కేంద్ర కమిటీ
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)